క్లుప్తంగా

అన్నదానం

చిట్వేలి : రాజుకుంట పంచాయతీ అనుంపల్లి గ్రామ యువ నాయకులు శనివారం రేణిగుంటలో అభయక్షేత్రంలోని అనాథలకు, వికలాంగులకు అన్నదానం చేశారు. మెగాస్టార్ చిరంజీవికి పద్మవిభూషణ్, మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుకు భారతరత్న వచ్చిన సందర్భంగా అన్నదానం చేసినట్లు యువకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుత్తి జగదీష్, మురళీ, పసుపులేటి వెంకటరమణ, తేజ, మాధినేని బాలరాజ తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వాదం



పుల్లంపేట : ఓబులవారిపల్లె మండలం రాళ్లచెరువుపల్లె వైఎస్సార్‌సీపీ నాయకుడు పోలి ప్రతాప్‌రెడ్డి, తరణి వివాహం శనివారం పుల్లంపేటలో జరిగింది. ఈ వేడుకలకు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అమర జవాన్ల సేవలు మరువలేనివి



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ షేక్ హుస్సేన్

సుండుపల్లె (రాయచోటి టౌన్) : అమరులు అయిన జవాన్లను స్మరించుకోవడం మన కర్తవ్యమని సుండుపల్లె ఎస్‌ఐ షేక్ హుస్సేన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిమ్ నిర్వాహకుడు పెనుబాల శేఖర్ ఆధ్వర్యంలో అమర జవాన్ల సంస్మరణ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్‌ఐ మాట్లాడుతూ రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన వీర జవాన్లను స్మరించుకొని రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మనోహర్, షబ్బీర్, రమేష్ కత్తి, వాణి, రెడ్డి రాణి, గణేష్, శ్రావణి, నాసీర్, శివ, అమరనాథ్, ముక్తియార్, చక్రీ, నాసీర్, వేణు కత్తి, పూజిత, హస్లాం, మహబూబ్‌బాషా, సంతోష్, నారాయణ, దీపా బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన రైల్వే ఇంజినీరింగ్ సిబ్బంది



విధులు బహిష్కరించిన రైల్వే ఇంజినీరింగ్ ఉద్యోగులు

నందలూరు(రాజంపేట): నందలూరు రైల్వే కేంద్రంలో శనివారం ఉదయం రైల్వే ఇంజినీరింగ్ సిబ్బంది విధులు బహిష్కరించిన సంఘటన చోటు చేసుకుంది. శుక్రవారం స్థానిక రైల్వే బుకింగ్ కార్యాలయం వద్ద రైల్వే ట్రాక్‌మెన్ రాహుల్ ప్రసాద్, జీఆర్‌పీ కానిస్టేబుల్ నాగార్జునల మధ్య వాగ్వివాదం జరిగింది. అనంతరం నాగార్జున.. రాహుల్ ప్రసాద్‌ను కొట్టడంతో గొడవ పెద్దదైంది. ఈ విషయం చిలికి గాలివానలా మారి రైల్వే ఇంజినీరింగ్ ఉద్యోగులు విధులు బహిష్కరించారు. దీంతో రైల్వే కార్మిక నేతలు, పీడబ్ల్యూఐ సురేష్, జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సుభాన్ చొరవ తీసుకొని ఇద్దరి మధ్య సయోధ్య కుదిరించారు. దీంతో వివాదం సద్దుమనిగింది.

104 వాహన సేవల పరిశీలన



104 వైద్య సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని పొందలూరు గ్రామంలో 104 వాహనం వచ్చినప్పుడు ఆశావర్కర్లు రోగులను వాహనం దగ్గరకు తీసుకురావాలని డీఎంహెచ్‌ఓ కొండయ్య తెలిపారు. గ్రామాలలోకి వాహనం రాగానే ఆశావర్కర్లు షుగర్ పేషెంట్లు, ఇతర పేషెంట్లకు ఇచ్చిన పుస్తకాలను తీసుకువచ్చి వారికి మందులను పంపిణీ చేయించి తిరిగి వారిని ఇంటికి చేర్చాలన్నారు. ఆశా వర్కర్లు రోగులకు సేవ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే సబ్ సెంటర్లలోనూ, పీహెచ్‌సీలలోనూ రోగులకు కావాల్సిన మందులను పంపిణీ చేయాలన్నారు. మందుల కొరత లేదని వారు తెలిపారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చి 104 సేవలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తేజశ్వినీ, యుడీసీ సిద్దిరామయ్య, వైద్య సిబ్బంది జమున, మస్తాన్, నీలిమ, బ్రహ్మయ్య, డ్రైవర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అతివల ఆర్థికాభివృద్ధికి 'ఆసరా'

- 4వ విడత వైఎస్సార్ ఆసరా వేడుకలు
- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, ఎమ్మెల్యే మేడా





మండల పరిధిలోని ఆసరా వేడుకల్లో పాల్గొన్న మహిళలు, మున్సిపల్ పరిధిలోని డ్వాక్రా మహిళలకు మెగా చెక్ అందజేస్తున్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే

రాజంపేట రూరల్ : మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆసరా ఇస్తున్నారని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. పట్టణ పరిధిలో 4వ విడత వైఎస్సార్ ఆసరా వేడుకలను శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ముందుగా డ్వాక్రా మహిళలు తయారు చేసిన వాటితో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లను పరిశీలించారు. వారి ఆర్థిక స్థోమతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి బాటలు వేసింది నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని తెలియజేశారు. నేడు మహిళలను అన్ని రంగాలలో రాణులుగా తీర్చి దిద్దతుంది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. ఇచ్చిన వాగ్దానాలలో 99 శాతం నెరవేర్చిన ఘనత జగనన్నదేనని పేర్కొన్నారు. మహిళల ఉన్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న జగనన్నను మహిళలందరూ కలిసికట్టుగా దీవించాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలోని 466 స్వయం సహాయక సంఘాలకు చెందిన డ్వాక్రా మహిళలకు రూ.4 కోట్ల 15 లక్షల మెగా చెక్‌ను అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, వైస్ చైర్మన్ మర్రి రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు వడ్డే రమణ, జేవీ కృష్ణారావు, పీ సుధాకర్, ఎం.వెంకటసుబ్బయ్య, జీ బాలకృష్ణ, ఎం.సురేఖ, శ్రీవాణి, జీ రాజేశ్వరీ, టీ లక్ష్మినారాయణ, కౌన్సిలర్‌లు ఎస్ నవీన్‌కుమార్, డొంకా సూరి, నాయముతుల్లా, డీ మౌనిక, మేనేజర్ శేషఫణి, సీఎంఎం డీజీవీ గోపీనాథ్, సీఓలు పద్మ, భాస్కర్, డీఈఓ శివకుమార్, ఆర్‌పీలు, ఓబీలు, ఎస్‌హెచ్‌జీ మెంబర్స్, వందలాది మంది మహిళలు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో మహిళలే మహారాణులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలు మహారాణులుగా వెలుగొందుతున్నారని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. రూరల్ పరిధిలో 4వ విడత వైఎస్సార్ ఆసరా వేడుకలను స్థానిక కళాంజలి కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి మహిళా అండగా నిలవాలని కోరారు. ప్రతి మహిళా ఆర్థికంగా బలపడాలటే వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని 724 స్వయం సహాయక సంఘాలకు చెందిన డ్వాక్రా మహిళలకు రూ.5 కోట్ల 93 లక్షల మెగా చెక్‌ను అందజేశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఏసీ వేణుమాదవ్, ఏపీఎం బీ మదన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తంబెల వేణుగోపాల్‌రెడ్డి, పోలి మురళీమోహన్‌రెడ్డి, దాసరి పెంచలయ్య, అరెగెల సౌమిత్రి, సీసీలు, మహిళలు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే జగనన్న లక్ష్యం

నందలూరు(రాజంపేట) : మహిళా సాధికారతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ బుక్కే శేఖర్ నాయక్, ఏపీఎం వసుంధర ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ మండలంలోని 567 స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వ నిధుల నుంచి 4వ విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.6,90,19,643 జమ చేయడం జరిగిందన్నారు. మహిళలు ఈ ప్రభుత్వ హయాంలో ఆర్థికంగా బలపడడం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, జిల్లా వక్ఫ్‌బోర్డ్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, మండల పార్టీ అధ్యక్షులు అన్నం నాగేంద్ర మూర్తి, ఎంపీటీసీలు సుభాన్ బాష, సోమిశెట్టి సునీత, మాజీ సర్పంచ్ భూమన శివశంకర్‌రెడ్డి, నాయకులు ఆర్ముగం విశ్వనాథ్, అరిగెల సౌమిత్రి, గడికోట వెంకటసుబ్బారెడ్డి, గీతాల నరసింహారెడ్డి, గుణ యాదవ్, ఆనాల మధు యాదవ్, పెనుబాల నాగసుబ్బయ్య, కాకి చంద్ర, అధిక సంఖ్యలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు

రామాలయానికి రూ.లక్ష విరాళం

రాజంపేట : మండల పరిధి చవనవారిపల్లె గ్రామంలోని లక్ష్మీపల్లె దళితవాడలో రామాలయం నిర్మాణానికి రూ.లక్ష విరాళంను రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అందజేశారు. ఈ మేరకు శనివారం దళితపెద్దలకు ఈ విరాళంను అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు అంటే ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సోదరులకు ప్రత్యేక అభిమానం ఉందన్నారు. ఆపదలో వారికి ఏ సాయం చేయడానికి వెనుకాడరని కొనియాడారు. కార్యక్రమంలో ఏపీబీసీసీ స్టేట్ డైరెక్టరు తంబెళ్ల వేణుగోపాల్‌రెడ్డి, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనరు కృష్ణారావు యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పృథ్వీరెడ్డి, మందరం వేణు, దళిత నాయకులు దాసరి మహేష్, దాసరి వాసులు, నరసింహులు, దాసరి శ్రీరాములు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ పరిశీలన



సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న సబ్‌రిజిస్ట్రార్ గురుస్వామి

రాయచోటి అర్బన్ : మున్సిపల్ పరిధిలోని పలు సచివాలయాల్లో జరుగుతున్న జగనన్న ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను శనివారం రాయచోటి సబ్‌రిజిస్ట్రార్ గురుస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం ఆయన మున్సిపల్ ఆర్‌ఐ మల్లిఖార్జునతో కలసి పట్టణంలోని పలు సచివాలయాలను సందర్శించి రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియను పరిశీలించారు. రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియను వేగవంతంగా, పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కాగా సెలవు దినాలలో సైతం సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉంటూ రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియను కొనసాగిస్తుండడంపై పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతు భరోసా కేంద్రాల తనిఖీ



వంతాటిపల్లి రైతు భరోసా కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న బద్వేల్ ఏడీఏ నాగరాజ

సిద్దవటం : మండల పరిధి సిద్దవటం, వంతాటిపల్లి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, కియోస్క్, ఎరువుల నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జంగాపల్లి రెవెన్యూ గ్రామంలో ఈ–పంట నమోదు వివరాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. అలాగే సాగులో ఉన్న నువ్వులు, వరి, వేరు శనగ పంటలను పరిశీలించామన్నారు. రైతులు క్రమం తప్పకుండా పంట దశలను ఎప్పటికప్పుడు జాగ్రతగా గమనిస్తూ, తగు యాజమాన్య పద్ధతులను వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలతో ఆచరించాలన్నారు. అనంతరం వంతాటిపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలోని ఎస్.రాజంపేట గ్రామంలో పర్యటించి ఈ- పంట వివరాలను తనిఖీ చేశారు. వరి పంటలో ఆకుముడత పురుగు ఉధృతిని గమనించడం జరిగిందని ఆయన తెలిపారు. వరి పూత పాలు పోసుకునే దశలో ఉన్నది కావున మధ్యాహ్నం 2 గంటల తరువాత ఫ్లుబెండమైడ్ (ఫేమ్) ఎకరాకు 50 మిల్లీ లీటర్లు, (లీటరు నీటికి 0.25 మిల్లీలీటర్ల చొప్పున) లేదా క్లోరనంట్ర నిలిప్రోల్ (కొరజిన్) ఎకరాకు 60 మిల్లీ లీటర్లు(లీటరు నీటికి 0.3 మిల్లీ లీటర్ల చొప్పున) పిచికారి చేయాలన్నారు. అనంతరం మామిడి తోటలను పరిశీలించి రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కుల సభను జయప్రదం చేయండి



కరపత్రాలను విద్యార్థులకు పంపిణీ చేస్తున్న పౌర హక్కుల సంఘం నేతలు

రాయచోటి అర్బన్ : రాయచోటిలో ఆదివారం నిర్వహించనున్న తమ సంఘం 50 వసంతాల సభను జయప్రదం చేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి సి.వెంకటేశ్వర్లు, జిల్లా నేతలు రాయచోటి రవిశంకర్, పి.రెడ్డెయ్య, ఎం.రవిశంకర్ తెలిపారు. సభకు సంబంధించిన కరపత్రాలను వారు శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పంపిణీ చేశారు. ఉదయం 9 గంటలకు స్థానిక ఎన్‌జీఓ సభా భవనంలో సభ ఉంటుందన్నారు. ముఖ్య అతిథులుగా ఏపీసీఎల్‌సీ రాష్ట్ర కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి క్రాంతి చైతన్య, మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్రనేత ఫారూఖ్ సిబ్లీ, విరసం నాయకురాలు వరలక్ష్మి తదితరులు హాజరవుతారన్నారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై తమ హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతున్న వారికి మద్దతుగా నిలవాలని కోరారు.

పోలింగ్ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



చిట్వేలి : పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ఆర్‌ఓ లీలారాణి



సిద్దవటం: భాకరాపేటలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు, ఎస్‌ఐ

చిట్వేలి : పోలింగ్ విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించబోమని ఆర్‌ఓ లీలారాణి సంబంధిత సిబ్బందిని హెచ్చరించారు. శనివారం మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఎల్‌ఓలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ శేషంరాజు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

సిద్దవటం : మండల పరిధి పెద్దపల్లి గ్రామ పంచాయతీలోని భాకరాపేట గ్రామంలో ఉన్న పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు మురాషావలి, ఎస్‌ఐ పెద్ద ఓబన్నలు శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్నామన్నారు. భాకరాపేటలో ఉన్న 4 పోలింగ్ కేంద్రాలను, సిద్దవటం దిగువపేటలోని రెండు పోలింగ్ కేంద్రాలను పరిశీలించామన్నారు. అక్కడ విద్యుత్, ఫర్నీచర్, తాగునీటి వసతి, బాత్‌రూమ్‌లు, డోర్లు, ప్రహరీ, ర్యాంపు వంటి సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ అనూరాధ, వీఆర్‌ఓలు నాని, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణలో ట్రూనాట్ మెషిన్ కీలకం

మదనపల్లి : క్షయవ్యాధి నిర్ధారణలో సీబీ నాట్, ట్రూనాట్ మెషిన్ కచ్చితమైన ఫలితాలను ఇస్తూ, కీలకంగా పనిచేస్తుందని మెడికల్ కాలేజ్ సూపరిండెంట్ డాక్టర్.ఎం.ఎస్.రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్.జమున, జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.పద్మాంజలిదేవి అన్నారు. శనివారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో రూ.8లక్షల వ్యయంతో సీబీ నాట్, ట్రూనాట్ మెషిన్‌ను వారు ప్రారంభించారు. జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ శైలజ ఆధ్వర్యంలో టీబీనివారణ కార్యక్రమంలో భాగంగా యంత్రపరికరం జిల్లాకు మంజూరైనట్లు చెప్పారు. గతంలో ట్రూనాట్ మెషిన్ రాయలసీమలో తిరుపతి రుయా ఆస్పత్రిలో మాత్రమే అందుబాటులో ఉండేదని, ప్రస్తుతం జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటుచేయడం ఎంతో ఉపయోగకరమన్నారు. ట్రూనాట్ మెషిన్ ద్వారా గంట వ్యవధిలో నలుగురు క్షయ అనుమానితులకు కచ్చితమైన వ్యాధి నిర్ధారణ ఫలితాలు అందించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల వివిధ విభాగాల హెచ్‌ఓడీలు డాక్టర్.శివరామకృష్ణ, డాక్టర్.బాబు, డాక్టర్.శశికళ, డాక్టర్.అమరనాథరెడ్డి, డాక్టర్.అరుణ, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగశ్రీ, టీబీ విభాగం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించారు. తోమాల సేవ, ఏకాంత సేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

వైభవంగా ధ్వజారోహణ

తంబళ్లపల్లె : మండలంలోని కోసువారిపల్లెలో వెలసిన శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో రెండు రోజులుగా టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం ధ్వజారోహణం, రాత్రి పల్లకీ ఉత్సవం కనువిందుగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్‌బట్టార్, అర్చకులు రమేష్‌బాబు, వేదపండితులు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. టీటీడీ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథ,పలు సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరిపంచేశారు. కార్యక్రమంలో టీటీడీ ఈఓ వరలక్ష్మీ, ఏఈవో గోపినాథ్, ఇన్స్‌పెక్టర్ డిశ్యాంత్‌కుమార్‌లు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరులో సోమవారం మదనపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, స్థానికంగా ఉండే ప్రజా ప్రతినిధుల సహకారంతో నిర్వహించే వైద్య శిబిరాన్ని సమీప గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ శివన్న తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ గామిరెడ్డిగారిపల్లెకు చెందిన నాటుసారా విక్రేత వెంకటలక్ష్మమ్మ (52)ను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగార్జున రెడ్డి తెలిపారు. శనివారం గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న ఇంటిపై దాడులు నిర్వహించి నాటుసారా విక్రేతను అదుపులోకి తీసుకొని పదిలీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొన్నామని ఆయన పేర్కొన్నారు. ఆమెపై కేసు నమోదు చేసి వాల్మీకిపురం కోర్టులో హాజరుపరిచామన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

గుర్రంకొండ : ప్రతిభ కలిగిన విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఎంఈఓ సురేంద్రబాబు అన్నారు. శనివారం స్థానిక తెలుగు ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ ఏ 3 పరీక్ష ఫలితాల్లో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఇదే పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు సికిందర్ ఇంగ్లిషు గ్రామర్ పుస్తకాలను బహుమతిగా అందజేశారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహిస్తే మరింత మంచి ఫలితాలు వస్తాయన్నారు. హెచ్‌ఎం సాంబశివ, ఉపాధ్యాయులు శిరీష్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

డీఈఓకు సన్మానం

పీలేరు రూరల్ : అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన యు.శివప్రకాష్‌రెడ్డిని శనివారం పీలేరు ఎస్టీయూ నాయకులు కలసి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షుడు గంగిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నూతన డీఈవో చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ ఆర్థిక కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, పీలేరు మండల అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ అమరనాథ్‌రెడ్డి, కలకడ మండల అధ్యక్షులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



బోరు పనులు ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన శనివారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వ్యక్తిగత, సామూహిక సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. అప్పటికప్పుడు సంబంధించిన అధికారులకు ఆదేశాలు ఇచ్చి సమస్యలు పరిష్కరించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

మండల పరిధి రెడ్డివారిపల్లె పంచాయతీలోని త్రిమూర్తినగర్‌లో రూ.3 లక్షల 50 వేల జెడ్పీ నిధులతో తాగునీటి సమస్య పరిష్కారం అయ్యే విధంగా బోరు పనులను ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి, జెడ్పీటీసీ రత్నమ్మ, సీహెచ్.రమేష్, వైఎస్ కరీముల్లా, శివారెడ్డి, రమణారెడ్డి, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు పట్టణంలోని పగడాలపల్లెలో రూ.30 లక్షల నిధులతో చేపడుతున్న అండర్ డ్రైనేజీ పైపులైన్ సీసీ రోడ్డు పనులను, ఎస్వీ నగర్‌లో 25 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతం అభివృద్ధికి అన్ని విధాలా చర్యలు తీసుకుని, ప్రతి వీధిలో సీసీరోడ్లు, పైప్‌లైన్ పనులు చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఎంతో సహకరించారని తెలిపారు. ఏ ప్రభుత్వాలు చేయని పనులను కేవలం ఈ నాలుగు సంవత్సరాలలో చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోట శివసాయి, తల్లెం రమణారెడ్డి, సీహెచ్.రమేష్, బండారు మల్లి తదితరులు పాల్గొన్నారు.

గెలుపు ఓటములు సమానంగా తీసుకోవాలి



మదర్‌థెరీసా చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న ఎస్‌ఐ అబ్దుల్ జహీర్

నందలూరు (రాజంపేట) : గెలుపు ఓటములు సహజంగా తీసుకోవాలని ఎస్‌ఐ అబ్దుల్ జహీర్ తెలిపారు. శనివారం మండల పరిధి నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లిలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్వర్ణాంధ్ర సంస్థ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రాజంపేట పార్లమెంట్ స్థాయిలో యువతకు వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ముందుగా మదర్ థెరిసా చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షులు వేపగుంట శ్యామ్ రాజ్, విశ్రాంత లైన్‌మెన్ ఆంధ్రయ్య, సీనియర్ క్రీడాకారులు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, ఉమ్మడి శెట్టి సుధాకర్, పోలీసులు దర్బార్ బాషా, దిలీప్ కుమార్, స్కాట్ సభ్యులు, వివిధ పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ 'ఏ' సర్టిఫికెట్ పరీక్ష ప్రారంభం



కేడెట్స్ డ్రిల్ టెస్ట్ పరిశీలిస్తున్న లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని ముగ్గురాళ్ల కృష్ణప్ప మెమోరియల్ గాంధీనగర్ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం ఎన్‌సీసీ 'ఏ' సర్టిఫికెట్ కోర్సు డ్రిల్ పరీక్షలు నిర్వహించారు. కడప 30 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రిల్ టెస్ట్‌ను బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా విచ్చేసి పరిశీలించారు. ఎన్‌సీసీ కేడెట్స్ చేసిన డ్రిల్లు, మ్యాప్‌రీడింగ్, వెపన్‌ట్రైనింగ్ అంశాలను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ హైస్కూల్ మెయిన్, గాంధీనగర్, హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్‌స్కూల్, బాల వికాస్ హైస్కూల్, రాయచోటి రాజు విద్యాసంస్థలు, బద్వేలు ఫాతిమా హైస్కూల్ తదితర పాఠశాలల ఎన్‌సీసీ కేడెట్స్‌కు డ్రిల్ టెస్ట్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు పి.వి. సుబ్బారెడ్డి, ఇమాంఖాసీం, జయచంద్ర పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విష్ణు నామ జపం

కడప కల్చరల్ : విష్ణు సహస్ర నామ జపంతో జన్మ ధన్యమవుతుందన్న విశ్వాసం భక్తుల్లో ఉందని, పురాణాలు సైతం స్వర్గ సాధనకు దీన్ని ఉత్తమమైన మార్గంగా సూచించారని హౌసింగ్‌బోర్డు శ్రీ కోదండ రామాలయ నిర్వాహకులు దేశు వెంకటరెడ్డి అన్నారు. ఆలయ 24వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులుగా ఉదయం, సాయంత్రం ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. చివరి రోజు శనివారం శ్రీ విష్ణు సహస్ర నామ కోటి జప యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటే నైతిక విలువలు అలవడతాయని, తద్వారా ప్రశాంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమానికి చెన్నై నుంచి అఖిల భారత విష్ణు సహస్ర నామ పారాయణ సమాఖ్య అధ్యక్షులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ శ్రీధర్, ఉపాధ్యక్షులు సువర్చల, బెంగుళూరు, తిరుపతిల నుంచి విష్ణు నామ జపంలో విశేష అనుభవంగల 30 మందితోకూడిన ప్రత్యేక బృందాలు వచ్చాయి. వీరితోపాటు జిల్లాలోని దాదాపు అన్ని మండలాల నుంచి పలు దేవాలయాల ధార్మిక మండళ్ల కార్యక్రమంలో పాల్గొన్నాయి.